# అర్చావతార విశిష్టత

శ్రీ అర్చకం రామచంద్ర దీక్షితులు, తిరుపతి.

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయన్తామ్
న్యాయేన మార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు.

అంటూ దేవాలయంలో ఎన్ని మార్లు అర్చన జరిగితే అన్ని మార్లు స్వస్తి వచనం పలికే ప్రవృత్తి అర్చకులది.

అర్చన ఎందుకంటారా? శ్రీకృష్ణ భగవానుని సమాధానం వినండి.

''సహయజ్ఞాః ప్రజాస్సృష్ట్వా
పురోవాచ ప్రజాపతిః
అనేన ప్రస విష్యధ్వం
ఏషవో స్త్విష్ట కామధుక్.

ఆదియందు బ్రహ్మ ప్రజలను సృష్టించినపుడే యజ్ఞమును కూడ సృష్టించి వారితో నిట్లనెను.

''ఈ యజ్ఞమే కామధేనువువలె మీ సమస్త వాంచితములను తీర్చగలదు. దీని నాశ్రయించి మీరు పురోభివృద్ధి నొందుదురు గాక!''

''ఇష్టాన్ భోగాన్ హి వో దేవా
దాస్యంతే యజ్ఞ భావితాః
తైర్దత్తా నప్రదా య్యైభ్యో
యోభుఙ్క్తే స్తేన ఏవసః''.

యజ్ఞములద్వారా ఆరాధింపబడిన దేవతలు మీకభీష్ట భోగములను ప్రసాదింతురు. వారిచ్చిన భోగములనుండి వారికి కృతజ్ఞతా పూర్వకముగా కొంచెము కూడా నివేదించకున్నచో వాడు దొంగతో సమానము.

## అర్చన రెండు విధాలు:

అమూర్తమని సమూర్తమని, యజ్ఞ యాగాదులలో అగ్నిలోనికి వివిధ దేవతా మంత్రాలతో ఆహుతులను వదలడం ఆమూర్తమ్. ప్రతిమల నర్చించడం సమూర్త మనిరి.

భగవంతుని అస్తిత్వం ఐదు విధాలు:

పర, వ్యూహ, విభవ, అన్తర్యామి మరియూ అర్చారూపాలని. పోల్చిచెప్పడానికి, వర్ణించి చెప్పడానికి వీలుకాని రూపం పరరూపమ్. సృష్ట్యాదిలో ప్రకృతి పురుషులుగా పరిణమించిన పరమాత్మే పరరూపంలో ఉన్న పరమాత్మ.

వ్యూహరూపం ఐదువిధాలు: 'సవా ఏవ పురుషః పంచదాపం చాత్మా' అనే శ్రుతి వచనం కూడ ఈ విషయాన్ని బలపరుస్తోంది. ఈ రూపంలోని పరమాత్మ వాసుదేవుడు. ధర్మ, జ్ఞాన, ఐశ్వర్య, వైరాగ్యాలచే దైవీ గుణాల నాశ్రయించి మరి నాలుగు రూపాలను ధరిస్తాడు అవే పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధులనే నామాలతో పంచవ్యూహాలుగా ప్రసిద్ధి చెందారు.

పరమాత్మయొక్క అవతారాలన్నీ విభవ రూపాలే. దశావతారాలు ప్రసిద్ధాలైనా, అవతారాలు అనంతం అంటూ శ్రీమద్భాగ వతము ఘోషిస్తోంది.

అంతర్యామి అనేది భగవంతుని నాల్గవ రూపము ప్రతిజీవి యొక్క హృదయ కమలంలో ధాన్యపు ముల్లులా ఒక పసుపు పచ్చనిరేఖ దాని శిఖ యందు ఒక జ్యోతి, దాని మధ్యలో పరమాత్మ అంతర్యామి రూపంలో ఉంటాడని చెబుతోంది పురుషసూక్తం.

పరమాత్మయొక్క ఐదవ రూపము అర్చారూపమే. ఇదే మనకు అత్యంత ప్రయోజనకారి. మరియు అత్యుత్కృష్ట ఫలప్రదమైనది. ఎందుకంటే పరమాత్మ యొక్క మొదటి రెండు రూపాలు (పర వ్యూహాలు) నిత్య ముక్తులకు మాత్రమే అనుభవైక వేద్యాలు. మూడవదైన విభవరూపం సమకాలికులకు, సన్నిహితులకు మాత్రమే పూజించడానికి వీలైనది. అంతరాత్మ స్వరూప ముందంటే విశుద్ధులైన యోగసిద్ధులకే దాన్ని దర్శించుట సాధ్యం. భగవద్గీతలో చెప్పిన కర్మయోగంద్వారా దర్శించేవి కూడా ఈ అంతర్యామినే.

అందుకే అర్చారూపం సర్వులకూ సర్వదా, సర్వ విధాలా విశేష ప్రయోజనకారి. ఏకాగ్రతకూ, భక్తికి, స్థాయిభావాల సంతర్పణకు ఆధ్యాత్మిక, అది భౌతిక, అది వైదిక సామాజిక ప్రయోజనాలకు ఇది మూలాధారము.

గాలిలాగాను, అలలాగాను అతి చంచలమైన ఆలంబన రహితమైన చిత్తానికి అకుంఠితమైన ఏకాగ్రతను సాధించడం ఒక్క సుందర సుమనోహర ప్రసన్నవదనేక్షణ మైన

పరమాత్మ విగ్రహం ద్వారానే సాధ్యం. 'చంచలం హిమనః కృష్ణ! అంటూ అర్జునుడు 'అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలం' అంటూ భగవంతుడైన శ్రీకృష్ణుడే అన్న మాటలను బట్టి చూస్తే అల్పసత్త్వులు, చంచల స్వభావులైన మానవులకు విగ్రహారాధన అవసరం ఎంత ఉందో ఇట్టే అర్థమౌతుంది. విచ్చలవిడితనానికి పశుప్రవృత్తిని రెచ్చగొట్టే పోకడలకు ఆలవాలమైన ఆధునిక జనారణ్యాలలో ఆలయాల ఆవశ్యకత ఎంతైనా వుంది. పూజా ధ్యానాదులు ఒక్క సాకార పరమాత్మ విషయంలోనే సాధ్యం. అది తనకు ఇష్టమే నన్న విషయాన్ని భగవంతుడే అవతారాలెత్తడం ద్వారా ప్రవచించాడంటూ విష్ణు ధర్మోత్తర పురాణం ఇలా చెబుతోంది.

పూజాధ్యానాదికం కర్తుం
సాకార స్యైవ శక్యతే
ప్రాదుర్భావేష్వథాకారం
తం విశంతి దివౌ కసః.

ఈ దేవతార్చన రెండు విధాలు: గృహ దేవతార్చన, ఆలయ దేవతార్చన అని వైఖానస కల్పసూత్రం ఈ దేవతార్చనను నిత్యకర్మగా నిర్దేశించింది.

దేవాలయాల బహూళార్థ సాధకతను భవ్యార్థ ప్రాపకతను గుర్తెరింగి మన పూర్వీకులు దేవాలయాలకు నాందీ పలికారు.

ఆచార్యర్చక పాచక పరిచారిక యజమానులు ఆచార్యుడే కార్యదృష్ట, స్రష్ట, సంరక్షకుడు కూడా ఆయనే దైవసాన్నిధ్యానికి కారకుడు. అర్చనాది అన్నీ పూజా కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలోనే జరగాలి. ఆయనే కార్యకర్య నిర్ణేత.

## అర్చకుడు

సమంత్రముగా దేవునికి ఉపచారాలు చేసేవాడు.

## పాచకుడు

ఆలయ పాకశాలలో దైవ ప్రసాదములు శుచిగా తయారుచేసి శ్రీవారి నివేదనకు ప్రసాదములు సిద్ధంచేయువాడు.

## పరిచారకుడు

అర్చకుని సహాయకుడు.

## యజమాని (అధికారి)

ఆధ్యాత్మిక ఆసక్తికలవాడై ఉండాలి. మోక్షార్థ చింత, సర్వ సమత్వము, త్యాగబుద్ధి, భక్తి, ప్రసన్నమైన ఆత్మకలవాడై ఉండాలి. ఆచార్య సందేశానికై ఎదురుచూస్తూ, అర్చకుని హితంకోరుతూ, పాచక పరిచారకులను దయతో చూస్తూ తీర్థ ప్రసాదములను నిర్మాల్యమును భక్తితో స్వీకరిస్తూ ఉండాలి.

## శాస్త్రాలు స్వతః ప్రమాణాలు

సూర్యుణ్ణి చూడటానికి దివిటీ అవసరంలేనట్లే నేను ఉన్నాను అనే జ్ఞానం కోసం ఇతరుల సహాయం అక్కరలేనట్లే శాస్త్రాలకు ప్రామాణికతను సమీకరించడానికి వేరే ప్రమాణం అవసరంలేదు. భ్రమ, సంభ్రమ, విభ్రమ, విస్మరణాదులకాల కాలమైన మానవమాత్రుల సంవిధానాలకు, సంస్కరణలకే ప్రాముఖ్యతను ఆపాదిస్తున్న ప్రస్తుత తరుణంలో స్థిత ప్రజ్ఞులైన మన ప్రాచీన ఋషుల వచనాల ప్రామాణికతను శంకించడం చూస్తే చిల్లరతనంగా ఆకతాయి తనంగా అనిపిస్తుంది.

శాస్త్ర విధిని విడనాడి ఆచరింపబడిన పని అనుకొన్న ఫలితాన్ని ఇవ్వకపోగా అనర్థాలను కొనితెస్తుందని శాస్త్రం ఈ విధంగా ఘోషిస్తుంది.

యచ్ఛాస్త్ర విధి ముత్సృజ్య
క్రియతే కామకారతః
నోత్తం దద్యా త్ఫలం
కర్మప్రత్యుతానర్థదం భవేత్.

యచ్ఛాస్త్ర విధి ముత్సంజ్య అనే గీతావచనం కూడా పై విషయాన్ని బలపరుస్తోంది.

ఆధ్యాత్మిక, ఆది భౌతిక సాంఘిక, రాజకీయాలలో ఏ ఒక్కదాన్ని చిన్న చూపు చూచినా వక్ర భాష్యం చెప్పినా ఒకదాని కొకటి బలిపెట్టినా సభ్య సమాజానికి తద్వారా విరాట్ పురుషునికి ద్రోహం చేసినవాళ్ళమౌతామని అనటంలో ఎటువంటి సందేహం లేదు. ★

## తిరుమలలో చేయకూడనివి

★ విలువైన ఆభరణాలు, ఎక్కువ డబ్బు మీ వద్ద వుంచుకోకండి.
★ మాంసాహారాన్ని భుజించకండి, ఏ విధమైన మత్తు పదార్థాలు సేవించకండి.
★ పొగ త్రాగకండి; ఆలయ పరిసరాల్లో పాదరక్షలు ధరించకండి.
★ వసతి సౌకర్యం కోసం అపరిచితులను ఆశ్రయించకండి.
★ శ్రీవారి సులభ దర్శనంకోసం దళారీలను ఆశ్రయించకండి.
★ ఆలయంలో సాష్టాంగ దండ ప్రణామాలు చేయకండి.
★ శ్రీవారి దర్శనంకోసం కాకుండా వేరే ఇతర ఉద్దేశాలతో తిరుమలకు రాకండి.
★ శ్రీవారి దర్శనం కోసం త్వరపడకండి. క్యూలో మీవంతు వచ్చేవరకు ఆగండి.
★ ఆలయ ప్రాంగణంలో ఉమ్మి వేయటం వంటి అసహ్యకరమైన పనులు చేయకండి.
★ తిరుమలలో పువ్వులు పెట్టుకోకండి. పువ్వులన్నీ శ్రీవారి పూజకే.
★ పరిసరాలను అపరిశుభ్రం చేయకండి.